# సినిమా రాజ్యంలో ఓ రోజు



సినిమా తారలందరూ రాజకీయాల్లోకి వలసపోతున్నారు. పార్లమెంటులో అసెంబ్లీల్లో సినిమా నటీనటులు నిండిపోయే రోజు ఎంతో దూరంలేదు. అలా జరిగినప్పుడు సినిమా రాజ్యంలో– ఓ రోజు–

ఇక చదవండి :

మా కాలనీలో ప్రభుత్వం ఇటీవలే ఏర్పాటు చేసిన కమ్యూనిటీ టీవీ సెట్ పెద్ద సౌండ్‌లో మోగసాగింది.

"తెలుగు వీర లేవరా...."

రోజూ ఆ పాటతో ప్రజలంతా నిద్రలేవాలని ప్రభుత్వం ఆదేశాలివ్వటం చేత నేను లేచి టైమ్ చూసుకున్నాను. అయిదున్నరవుతోంది. ఇంకా చీకటిగానే ఉంది బయట.

"ఏవండోయ్– బ్రాందీ తెమ్మంటారా. విస్కీ తెమ్మంటారా?" లోపల్నుంచి అరచింది మా ఆవిద.

"బ్రాందీ!" అన్నాన్నేను.

"బ్రాందీ వద్దు మమ్మీ! విస్కీ కావాలి! విస్కీ–" అరచారు పిల్లలు.

ఈ గొడవ రోజూ ఉండేదే! ఒకోళ్ళకూ ఒకోరుచి.

మా ఆవిడ రెండు సీసాలు తీసుకొచ్చి ఎవరికేది కావాలో వాళ్ళకది గ్లాసునిండా పోసి ఇచ్చింది.

"మరి నువ్వు తాగవేం?" అడిగాన్నేను.

"నేను రమ్ము తాగేశానండీ ఇందాకే! ఈ మూడింట్లోనూ అదే మంచిదన్నాడు డాక్టరు......." అందామె.

సినిమా రాజ్యం వచ్చాక ప్రజలందరూ కూడా సినిమా ఫీల్డులో ఉండే అలవాట్లు చేసేసుకున్నారు. మరి ఆ ఫీల్డులో తెల్లవారుజాము నుంచీ అర్థరాత్రి వరకూ రమారమి అందరూ బాగా అలవాటుపడేది మందుకే గదా! అందుకే ప్రభుత్వం బ్రాందీ, విస్కీ, రమ్ములాంటివి రేషన్ కార్డుమీద కారు చవగ్గా అందజేస్తున్నారు. ఎల్లో కార్డు ఉన్న వాళ్ళకు పెద్ద బ్రాందీ డ్రమ్ పదహార్రూపాయలు! గ్రీన్ కార్డు వాళ్ళకు అదే ముప్పయ్ రూపాయలు.

పిల్లలు విస్కీ తాగటం ముగించి మొఖాలు కూడా దాన్తోనే కడుక్కొని సిగరెట్లు తాగుతూ కమ్యూనిటీ టీవీలో మొదలయిన "విచిత్రహార్" ప్రోగ్రాం చూడసాగారు.

రోజూ ఉదయం ఆ ప్రోగ్రామ్‌లో పార్లమెంట్ సభ్యుల తాలూకు విభిన్న చలనచిత్ర పాత్రల్ని– విభిన్న సినిమాల నుంచి కొంచెం కొంచెం చూపిస్తారు.

ఆఖర్లో ఆ సభ్యుడు వచ్చి రెండు ముక్కలు మాట్లాడతారు.

ఆ రోజు ''ఫాల్తూ ఆద్మీ'' అనే హిందీ సినిమాలోని చలనచిత్ర నటుడు మాట్లాడుతున్నాడు.

"సినిమాల్లోకి రాకముందు నేను జేబులు కొడుతూండే వాడిని! ఓ సారి ఓ డైరెక్టర్ జేబు కొడుతూండగా ఆయన నన్ను పట్టుకుని సినిమాల్లో జేబులుకొట్టే పాత్ర ఇచ్చారు. ఆ రోజు నుంచీ అన్నీ అవే పాత్రలు. ఈలోగా ఎలక్షన్లు వచ్చాయ్. ఓ నామినేషన్ పత్రం పడేశాను. అంతే అద్భుతమయిన మెజారిటీతో ప్రజలు నన్ను గెలిపించారు!"

మరి కాసేపటికి పిల్లలు పంచరంగుల డ్రస్‌లు వేసుకుని స్కూల్‌కి బయల్దేరారు. ఇప్పుడు ఇదివరకులాగా వాళ్ళు ఒకే రకం యూనిఫారం వేసుకోనక్కర్లేదు. ఎవరిష్టమొచ్చిన కాస్టూమ్స్ వాళ్ళు వేసుకోవచ్చు. ఆ కాస్టూమ్స్ అయిదు రంగులుంటే చాలు.

నేనూ కాస్ట్యూమ్స్ వేసుకుని భోజనం చేసేసరికి రంగారెడ్డి శాయిరామ్, గోపాల్రావ్, జనార్ధన్, యాదగిరి వచ్చేశారు.

"త్వరగా పద మ్యూజిక్ మొదలయిపోయిది." అన్నాడు రంగారెడ్డి.

నగరంలోని అన్ని ఏరియా కమ్యూనిటీ సెంటర్స్ నుంచీ ఆఫీసులకు వెళ్ళే ప్రజల కోసం దేశభక్తిని ప్రేరేపించే పద్ధతిలో మ్యూజిక్ వినిపిస్తారు. నలభై నిముషాల వరకు నగరమంతా ఆ మ్యూజిక్ అలా వినిపిస్తూనే ఉంటుంది. అందరూ మ్యూజిక్ ఆగిపోయే లోపల ఆఫీసులకు చేరుకుంటేనే అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చేయనిస్తారు. లేకపోతే ఆ రోజుకి ఆబ్సెంటే!

మేము ఆఫీస్‌లోకి అడుగు పెడుతూండగా మ్యూజిక్ ఆగిపోయింది. ఎదురుగ్గా ఉన్న 70 ఎం.ఎం తెరమీద టైటిల్స్ వేయడం ప్రారంభమయింది. ఆ రోజు మా ఆఫీస్ మేనేజర్ ఎవరూ, మా డిపార్ట్‌మెంట్‌కి శెక్రటరీ ఎవరూ, మంత్రి ఎవరూ అనేవి టైటిల్స్‌లో వస్తాయి.

ఆ తరువాత ఆ రోజు డీల్ చేయాల్సిన ఫైల్స్‌ని చూపిస్తారు. వాటిల్లోనే పెండింగ్‌లో ఉండి శతదినోత్సవాలు చేసుకున్న ఫైల్సూ, ఫ్లాప్ ఫైల్సూ, షూటింగ్‌లు ఉన్న ఫైల్సూ అన్నీ కనిపిస్తాయ్.

ఆ తరువాత మా శాఖకు చెందిన మంత్రిగారు నటించిన చిత్రాల్లోని కొన్ని భాగాలు మేము విధిగా చూడాలి. మిస్సయితే ఫైన్ వేస్తారు.

మంత్రిగారు చేసిన ఫైట్ ఆఖర్లో చూపిస్తారు.

తన ఆదేశాలను ధిక్కరించే క్లర్క్‌లు అలాంటి ఫైట్‌కి సిద్ధపడి ఉండాలన్న హెచ్చరిక ఆఖర్లో వస్తుంది.

ఆ సీను చూడ్డం అయాక ఎవరి సీట్స్‌లో వాళ్ళు కూర్చున్నాం.

అదే సమయంలో మా చీఫ్ క్లర్క్ మేకప్ రూమ్ నుంచి అందరికీ అభివాదం చేస్తూ బయటికొచ్చాడు.

యాభై అయిదేళ్ళ మనిషల్లా ఇప్పుడు ఆ మేకప్‌లో పాతికేళ్ళ కుర్రాడిలా కనబడుతున్నాడు.

మేమంతా కూడా మేకప్ రూమ్‌లోకి పరుగెత్తి త్వరత్వరగా మొఖానికి రంగులేసుకుని, తలకు విగ్గులు పెట్టుకుని బయటికొచ్చాము.

డిపార్ట్‌మెంట్ టీవీ స్క్రీన్ మీద ముఖ్యమంత్రి దేవభక్తి గీతం ప్రారంభమయింది.

“మనమంతా ప్రజల సేవకులం– కంట్రాక్టర్లనూ గుండాలనూ ప్రేమతో జయిద్దాం! రాష్ట్రాన్ని నందనవనంగా మారుద్దాం” అంటూ పాట ముగిసింది. ఆ తరువాత ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న (ముఖ్యమంత్రి హీరోగా నటిస్తున్న) చిత్రంలో కొన్ని సీన్లు చూపిస్తున్నారు.

మా ఉద్యోగులంతా ఆ సీన్లు చూడటం చాలా అవసరం.

ఎందుకంటే మాకు ప్రమోషన్స్ వచ్చేందుకు పెట్టే డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో రాబోయే

ముఖ్యమంత్రి చిత్రాల్లోని పాత్రల గురించీ, సీన్స్ గురించీ కొశ్చెన్స్ ఉంటాయ్.

అప్పుడు ఎంటర్‌టెయిన్‌మెంట్ సాంగ్ మొదలయింది.

ఆఫీస్ సూపర్నెంట్ నిజంగా పాతికేళ్ళ కుర్రాడి లాగానే సీనియర్ లేడీ క్లర్క్‌తో పాటు విగురుతూ, మా అందరి టేబుల్స్ మీద నుంచీ పరిగెడుతూ డాన్స్ చేశాడు.

ఆయన ఆదేశాల మేరకు మేమంతా కూడా ఆ పాటకు కోరస్ పాడాం!

పాట అయిపోయింది. అందరం తప్పట్లు కొట్టి విజిల్స్ వేశాం. అప్పుడు ఆఫీస్ పని మొదలయింది. స్పీకర్‌లో బాక్‌గ్రౌండ్ మ్యూజిక్ స్లోగా మొదలయి, క్రమేపీ వేగం పుంజుకుని ఆఖరికి బాగా స్పీడ్ అయిపోతుంది.

ఎందుకంటే మా ఆఫీస్ వర్క్ కూడా ఆ మ్యూజిక్ తగ్గట్టుగా ఫాస్ట్‌గా చేయాలని మా సినిమా ప్రభుత్వం రూల్. అందరం మ్యూజిక్‌కి తగ్గట్లుగా, ఫైల్స్‌లో నోట్స్ రాసేస్తూ, ఫైల్స్ తీసుకుని ఒక టేబుల్ నుంచి ఇంకో టేబుల్ దగ్గరకు డాన్స్ స్టెప్స్‌తో పరుగెడుతూ వర్క్ చేస్తున్నాం! మధ్యాహ్నం ఒంటిగంటకు హఠాత్తుగా మ్యూజిక్ ఆగిపోయింది.

'హమ్మయ్య' అనుకున్నాం– అందరం చెమటలు తుడుచుకుంటూ.

మేము కాంటీన్లో కెళ్ళగానే "ఇడ్లీ వడే మాకు విందు భోజనం– టీ నీళ్ళే అమృతం– వీటితోనే దేశాన్ని సేవిస్తాం! ప్రజలను నెత్తి కెక్కించుకుంటాం" అన్న పాట బాక్‌గ్రౌండ్‌లో వినబడుతోంది.

సాయంత్రం అయిదయేసరికి రాష్ట్ర గవర్నర్ టీవీ స్క్రీన్ మీద కనిపించారు. అందరం లేచి నిలబడగానే గవర్నర్ విలన్‌గా నటించిన ఓ చిత్రంలో గవర్నర్ స్వయంగా పాడిన పాట మొదలయింది.

"మేరే అంగనేమే తుమ్హారా క్యా కామ్‌మై" అనే ట్యూన్‌లో ఉందా పాటంతా.

పాట పూర్తవగానే గవర్నర్ విలన్స్‌తో ఫైటింగ్ చేసిన కొన్ని సినిమాల్లోని దృశ్యాలు చూపించారు.

అవన్నీ పూర్తవగానే అందరం "జై సినిమా! జై హింద్! శుభం" అంటూ నినాదం చేసి మేకప్ రూమ్‌లోకి పరుగెత్తి మేకప్పూ, విగ్గులూ అన్నీ తీసేసి ఇళ్ళకు బయల్దేరాం.

బస్ స్టాప్‌లో ఎంతసేపు నిలబడ్డా 'నటసార్వభౌమ' అనే బస్ మాత్రం రాలేదు. అన్నట్లు సినిమా రాజ్యంలో బస్‌లకు నెంబర్లుండవ్. సినిమా నటీనటుల పేర్లు, వాళ్ళ బిరుదులు, ఇవే ఉంటాయి. మా కాలనీకి నటప్రపూర్ణ బస్‌లో బయల్దేరాం. ఆ బస్ "సాగరసంగమం" బస్ డిపో మీదుగా ప్రతిఘటన కాలనీ, అమెరికా అల్లుడు నగర్, ఎదురింటి మొగుడు, పక్కింటి పెళ్ళాం బ్రిడ్జి మీద నుంచీ మా కాలనీ, చేరుకుంది.

కాలనీకి చేరుకునేసరికి మా కాలనీ లేడీస్ అందరూ అడవి కన్యల డ్రస్ వేసుకుని, అడవి జాతి స్త్రీలు చేసే ట్రైబల్ డాన్స్ చేస్తూ మా అందరికీ స్వాగతం పలికారు. ఆ పాట

మధ్యలోనే అందరికీ 'టీ' కప్పులు కూడా అందించేశారు.

ప్రభుత్వోద్యోగులందరూ ఇళ్ళు చేరుకునేటప్పటికి వాతావరణం అహ్లాదకరంగా కనిపించాలని ఇదంతా ప్రభుత్వ ఆస్థాన కొరియోగ్రాఫర్ చేసిన ఏర్పాటు! ఆ తరువాత కాలనీలో యంగ్ గాళ్స్ అందరూ కలసి లేటెస్ట్ సినిమా బూతుపాటని అంగాంగ అభినయంతో పాడి అందరిని అలరింపజేశారు. ఆ పాట రాసిన లిరిక్ రైటర్ వెంటనే టీవీ స్క్రీన్ మీద కనబడి తను ప్రభుత్వాదేశాల మేరకు ఎంత కష్టపడి ఆ పాట రాసిందీ వివరించాడు.

"ఈ పాటను నేను ఒక ఛాలెంజ్‌గా తీసుకున్నాను. ఎందుకంటే ఈ సినిమా రాజ్యానికి నావంతు తోడ్పాటు నేనందించాలి కదా!

అందుకే దేశంలోని రెడ్‌లైట్ ఏరియాస్ అన్నీ తిరిగి, బూతుపాటలన్నీ సేకరించి వాటి మీద రీసెర్చ్ చేసి మరీ ఈ పాట రాశాను–"

ఆ కార్యక్రమం ముగుస్తూండగానే మా కాలనీలో కొంతమంది ప్రభుత్వం ఆఫీషియల్‌గా ఏర్పాటు చేసిన సెకండ్ సెటప్ ఇళ్ళకు వెళ్ళిపోయారు. సెకండ్ సెటప్‌లను ఎంకరేజ్ చేయటమే కాకుండా సెకండ్ సెటప్ ఉన్న ప్రతి ఉద్యోగికీ జీతం పైన మరో యాభైశాతం జీతం 'ఎక్స్ట్రా అలవెన్స్' పేరు మీద ఇస్తుంది.

ప్రతి మగాడికీ ఇద్దరు పెళ్ళాలున్న దేశంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయన్నది మా సినిమా రాజ్యం స్లోగన్.

హఠాత్తుగా గోపాల్రావ్ వాళ్ళ చిన్నిగాడు కొంపలు మునిగిపోయినట్టు ఏడుపు మొదలెట్టేసరికి అందరం వాడింటివేపు పరుగెత్తాం.

తీరా చూస్తే గోపాల్రావే వాడిని పట్టుకుని చితగ్గొడుతూ కనిపించాడు.

శాయీరామ్, రంగారెడ్డి వాడిని పట్టుకుని చిన్నిగాడిని రక్షించారు.

"సంగతేమిటి?" అడిగాన్నేను.

"ఈ రాస్కెల్‌ని చూడండి! ఫైనల్ ఎగ్జామ్స్ చెడగొట్టేశాడు...." అన్నాడు కోపంగా వాడి కొశ్చెన్ పేపర్ విసిరికొడుతూ.

"లేదంకుల్ అన్నీ బాగానే రాశాను. ఒక్క కొశ్చెన్ రాయలేదు."

శాయీరామ్ ఆ కొశ్చెన్ పేపర్ అందుకున్నాడు.

"సినీ నటబ్రహ్మ– ప్రముఖ సినీనటుడు– నేటి మంత్రివర్యులు– శ్రీరంగ జీవిత చరిత్ర క్లుప్తముగా వ్రాయుము! దీనికేం రాశావ్‌రా?"

వాడు అడిగిందే తడవుగా గడగడ చదివేయసాగాడు.

సినీ నటబ్రహ్మ శ్రీ రంగా– 1950లో రైతు–నాగలి చిత్రం ద్వారా సినిమా రంగమునందు ప్రవేశించి పదిహేను సంవత్సరాలపాటు మూడొందల తొంభయ్ చిత్రాల్లో

నటించి భారతదేశానికీ, భారత ప్రజలకూ ఎనలేని సేవ చేశారు.

వీరు నటించిన చిత్రంలో "రౌడీ వెధవ" "మేనత్త చెల్లెలి మొగుడు–దానమ్మకు యముడు" "దగుల్బాజీ నాయాలు" "పొగరుబోతు పుండాకోర్" చిత్రాలకు ఎన్నో ప్రభుత్వ అవార్డ్లు వచ్చాయ్...."

"చూశావా–చూశావా! దొంగబాడుకవ్, కత్తి పట్టిన కిరాతకపు ముండాకొడుకు" సినిమాల సంగతి మర్చిపోయాడు. రెండొందల డెభ్బై రోజులు ఆడిన మొదటి సినిమారా అది అని చిలక్కు చెప్పినట్లు చెప్పాను. దీనికి భారత ప్రభుత్వ అవార్డులు కూడా వచ్చాయ్–" మండిపడుతూ అన్నాడు గోపాల్రావ్.

"నాకా బూతుమాట గుర్తు రాలేదు డాడీ!–"

"ఛట్ వెధవా! ఇప్పుడు చూడు ఎనిమిది మార్కులు గోవిందా–"

శాయిరామ్ ఇంకో ప్రశ్న చదివాడు.

"ప్రఖ్యాత నటి కాంతిశ్రీకి. పద్దెనిమిదవ వివాహం ఎప్పుడు ఎవరితో జరిగినది? మిగతా పదిహేడుగురు భర్తల పేర్లేమి? వారిలో ఇంకా ఇప్పటికీ బ్రతికున్నవారెవరు?"

యాదగిరి చప్పున వాళ్ళబ్బాయి రమేష్ గాడిని ఈడ్చుకొచ్చాడు.

"ఒరేయ్ నువ్చెప్పరా దీనికి సమాధానం! నువ్వేం రాశావో– ఎలా రాశావో తేలుస్తానిప్పుడు" అన్నాడు వాడితో.

రమేష్ కళ్ళు మూసుకుని ఓ క్షణం ఆలోచించి అప్పజెప్పసాగాడు.

"శ్రీమతి కాంతిశ్రీకి పద్దెనిమదవ వివాహము 'మురుగా మహేశన్'తో 1982వ సంవత్సరంలో వాళ్ళ ఊళ్ళోనే పాడుబడ్డ గుళ్లో జరిగెను, ఆమె పాత భర్తల పేర్లు సంపత్, కుమార్, శ్రీశైలేశ్వరరావ్................"

శాయిరామ్ వాడి నోరు మూసేసి ఇంకో ప్రశ్న చదివాడు బిగ్గరగా.

ఈ క్రింది ఖాళీలను పూరింపుము.

'అడవిజలగ' చిత్రమునకు సహాయ దర్శకుడిగా పనిచేసిన వారు – డాష్–డాష్–డాష్– ఎవర్రా!"

"నువ్వు చెప్పరా!"

నేను మా కిరణ్ గాడిని అడిగాను ఈసారి.

"సన్యాసిరావ్" అన్నాడు తక్షణం వాడినెత్తిన ఒక్కటిచ్చాడు గోపాల్రావ్.

"సన్యాసిరావ్ కాదురా వెధవా! సింగినాథ్ రావ్! రాత్రేగా మీ అందరకూ ఈ కొశ్చెన్స్ 'ఇంపార్టెంట్రా' అన్ని చెప్పింది?"

వాడు ఏడ్పు మొఖం పెట్టాడు.

"ఈ క్రింది వాక్యమునకు సందర్భము వ్రాయుము–" అంటూ మరో ప్రశ్న

చదవసాగాడు యాదగిరి.

"అమ్మమ్మా! తాతయ్యా నువ్వూ మొదటిరాత్రి ఏం చేశారో మేము అదే చేశాం!" ఈ డైలాగు ఏ సినిమాలో ఎవరు, ఎవరితో, ఎప్పుడు, ఎందుకన్నారో వివరింపుము.

"ఛీ ఛీ ఛీ" అంది పార్వతీదేవి సిగ్గుపడిపోయి.

"పిల్లలకు ఇలాంటి డైలాగులా?"

"ఏడ్చినట్లుంది!" విసుక్కున్నాడు రంగారెడ్డి, రోజూ రేడియోలో 'మంగమ్మ గారి మనవడు' సినిమాలో మనవరాలు ఇదే డైలాగ్ పాట రూపంలో అమ్మమ్మతో అనటం వినటం లేదా? పైగా ఆ పాట పదేపదే వినిపించమని శాయిరామ్, జనార్ధన్ వీళ్ళందరూ జనరంజనిలో కోరటం నేను వినలేదనుకుంటున్నారా?"

ఎవరూ మాట్లాడలేదు.

యాదగిరి ఇంకో ప్రశ్న చదివాడు.

"వంగమాక - వంగమాక"

"కొట్టమాక- తిట్టమాక- కొట్టనివ్వు - తిట్టనివ్వు"

"లేత లేత చీకటీ, ముదురుతున్న ఆకలీ-

మత్తుమత్తుగా ఏదో వత్తిడీ-

మెత్త మెత్తగా ఏదో వత్తిడీ"

ఈ పాటలు ఏయే చిత్రములలోనివి? ఈ అద్భుతమయిన సాహిత్యమును సృష్టించిన గీత రచయిత, దర్శక మహాశయులు ఎవరు? వారి పూర్వ చరిత్ర ఏమి?

ఈ ప్రశ్నకు ముగ్గురు గడగడ సమాధానం చెప్పేశారు.

ఆఖరి ప్రశ్న చదివాడు శాయిరామ్.

"భారత దేశమునకు స్వాతంత్ర్యము ఎప్పుడు వచ్చెను? స్వాతంత్ర్యము సంపాదించుటకు పోరాడిన వారిలో ముఖ్యుల పేర్లు తెలుపుము?"

ఈ ప్రశ్నకు ఎవ్వరూ సమాధానం చెప్పలేకపోయారు.

"ఏమిట్రా ఇంత ఈజీ ప్రశ్నకు ఆన్సర్ తెలీదా?" ఆశ్చర్యంగా అడిగాడు రంగారెడ్డి.

"ఇది ఈజీ ఏమిటంకుల్? చాలా టఫ్ కొశ్చన్! మా క్లాసులో ఎవ్వరూ రాయలేక పోయారు! తెలుసా?"

శాయిరామ్ విరగబడి నవ్వాడు.

"ఈ మాత్రం ఆన్సర్ క్లాసులో ఎవ్వరికీ తెలీలేదా! పిచ్చి వెధవల్లారా? అదేదో తెలుగు సినిమా వచ్చింది చూడూ! పేరు గుర్తులేదు!

అది రిలీజయిన రోజే మనకు స్వాతంత్ర్యం కూడా వచ్చింది!"

అందరం ఒకరి మొఖాలొకరు చూచుకున్నాం!

అందరికీ ఆ సినిమా పేరు నోట్లోనే ఆడుతోంది గానీ- గుర్తు రావటం లేదు.

"మహాత్మాగాంధీ గురించి వ్రాయుము, పోనీ ఇదయినా రాశారు(ట్రా?" అడిగాడు గోపా(ల్రావ్.

"ఓ! చాలా ఈజీడాడీ!" అన్నాడు చిన్నిగాడు హుషారుగా, "క్లాసులో అందరం పేజీ ఫుల్‌గా రాసేశాం!"

"ఏమని రాశారు?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

మహాత్మాగాంధీ గురించి మేమే అంతా మర్చిపోయాం! వీళ్ళ కెలా గుర్తుందో తెలీటం లేదు.

రమేష్ గాడు ఠక్కున చెప్పటం ప్రారంభించాడు.

"మహాత్మాగాంధీ అసలు పేరు బెన్‌కింగ్స్ లే! ఇతను భారతీయుడే గాని బ్రిటిష్ పౌరుడు. వీరికి "మహాత్మాగాంధీ" అనే సెంటిమెంట్ పిక్చర్‌లో హీరోగా నటించినందుకు గ్గాను ఆస్కార్ అవార్డు అభించింది. వీరితోపాటు హీరోయిన్‌గా నటించినామె కూడా భారతీయురాలే! ఆమె పేరు రోహిణి హట్టన్‌గడి...."

"మరి డ్రాయింగ్ పరీక్ష కూడా అయింది కదూ?" అడిగింది పార్వతీదేవి.

"అయిందాంటీ!" ఉత్సాహంగా చెప్పారందరూ.

"ఏం బొమ్మ గీయమన్నారు?"

"ఏదయినా మీ కిష్టమొచ్చిన బొమ్మ గీయమన్నారాంటీ! క్లాసులో అందరం 'సిల్క్ స్మిత' బొమ్మ గీసాం! అదయితే తేలిక కదాంటీ! కాస్ట్యూమ్స్ కూడా ఎక్కువ గీయనక్కర్లేదు."

అందరం ఇళ్ళకు చేరుకున్నాం మళ్ళీ.

రాష్ట్ర ముఖ్యమంత్రీ, గవర్నరూ– హీరో విలన్స్ లాగా ఫైటింగ్ చేసుకొన్న సినిమా ఒకటి కమ్యూనిటి టీవీలోకి ప్రారంభమయింది.

పిల్లలంతా విజిల్స్ వేసి "కొట్టూ కొడుకుని! కొట్టూ" అని అరుస్తున్నారు. సినిమా అయిపోయింది. కాసేపు మళ్ళీ ప్రధానమంత్రి నటించిన సినిమాలోని ఓ సన్నివేశం! కమ్యూనిటీ టీవీలో ప్రతి పావుగంటకూ ప్రధానమంత్రి నటించిన సినిమా సన్నివేశం ఒకటి చూపటం మామూలే!

ప్రభుత్వ ఆదేశం ప్రకారం రాత్రి ఏడింటికి దేశంలోని భార్యాభర్తలు అందరూ కమ్యూనిటీ గార్డెన్‌లో డ్యూయెట్ పాడుతూ పరుగెత్తి డాన్స్ చేయాలి. అంచేత, నేనూ, మా శ్రీమతి బయటకు పరుగెత్తాం– పాట కూడా మొదలయిపోయింది.

పావుగంటసేపు అదే పాట.

"ముక్కు మీద కోపం–"

డ్యూయెట్ అయిపోయాక సినిమాల్లో సెక్స్ డాన్స్‌ల కోసమే తన జీవితం ధారపోసిన 'జ్యోతిలక్ష్మి' గుడికివెళ్ళి కొబ్బరికాయ కొట్టి, దణ్ణం పెట్టుకుని ఇంటికి చేరుకున్నాం!

కమ్యూనిటీ టీవీ ప్రత్యేక ప్రోగ్రాం ప్రసారం చేస్తోంది.

"జంట నగరాల్లో ఇవాళ సాయంత్రం వివిధ నటీనటుల "ఫిలిం ఫాన్స్ అసోసియేషన్స్" మధ్య చెలరేగిన దారుణ హింసాకాండలో రెండువందల డెబ్బయ్ మంది వరకూ మరణించారు. పద్నాలుగు వేల మంది గాయపడ్డారు. ఇంకో లక్ష మంది జాడ తెలీటం లేదు–

అంచేత నగరంలో నిరవధికంగా కర్ఫ్యూ విధిస్తున్నట్లు స్టంట్ మాస్టర్ భీమా ప్రకటిస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అదే వయసు, అదే రూపం గల ఎక్స్ట్రాస్‌ని సప్లయ్ చేసి, ఆ కుటుంబీకుల దుఃఖాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర హోంమంత్రి, సినిమా ఎక్స్‌ట్రా సప్లయర్ అయిన పిచ్చేశ్వర్రావ్ తెలియజేస్తున్నారు–"

